


2 అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 28 అక్టోబరు, 2024 | పేజీలు : 3

# ఆయన అవినీతికి అంతే లేదు!

**ఆయన అవినీతికి అంతే లేదు. సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి అవినీతి లీలలు అంత ఇంతా కాదు. వివిధ హోదాలో గత ఏడు సంవత్సరాల నుండి ఇక్కడే పని చేస్తూ అవినీతి అనకొండగా మారాడు. ఏ చిన్న పనికైనా రేటు కట్టి డబ్బులు దండిగా వసూళ్లు చేస్తున్నాడనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. తాను అడిగినంత ఇవ్వకుంటే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి. అతను తీసుకునే అక్రమ సొమ్ము నగదు రూపంలోనే కాకుండా ఎలాంటి భయం లేకుండా నేరుగా తన ఫోన్ పేలో డబ్బులు బదిలీ చేయించుకుంటున్నాడు. ఇతడి చేసే అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఎన్ని ఫిర్యాదులు అందినా చెత్తబుట్టలో వేసినట్టే. అక్రమాలు బయటపడుతున్నా అతనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.**

### పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి ఉద్యోగి లీలలు...!
### ఇతడిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా చెత్తబుట్టలోకే...!!
### అక్రమాలు బయటపడ్డా అతనిపై చర్యలు శూన్యం




**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయంలో ఓ ఉద్యోగి కారుణ్యనియామకం ద్వారా గత ఏడేళ్ళ క్రితం మొదట ఓ చిన్న పోస్టులో ఉద్యోగిగా చేరాడు. అనంతరం పదోన్నతిపై మండల స్థాయి అధికారిగా పని చేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఇతగాడు ఇక్కడే తిష్ట వేసి అక్రమ వసూళ్లకు తెరలేపాడు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జారీలో సంతకాలు చేసేందు సైతం మరింత దిగజారి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం జారీ 30రోజుల గడువులో ఇవ్వాల్సి ఉన్నా విచారణ పేరుతో కాలయాపన చేస్తూ దరఖాస్తు చేసుకున్న వారిని తన చుట్టు తిప్పుకుంటున్నా పరిస్థితిలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దీని కోసం రూ. 3వేల నుండి రూ. 5వేల వరకు ముట్టజెప్పితేనే ధృవీకరణ పత్రం జారీ పూర్తి అవుతుందని వాపోతున్నారు. వ్యవసాయ భూముల బదలాయింపులు, ధరణిలో మార్పులు, చెర్పులు, పట్టా మార్పిడి విషయంలో రూ. 10వేల నుండి రూ. 50వేల వరకు అతగాడికి ముట్టచెప్పాల్సిందే. ఇదేమని ప్రశ్నిస్తే నా ఒక్కడికే కావు ఈ డబ్బులు... ఉన్నతాధికారులకు కూడా ఇవ్వాల్సి ఉంటుందని తిట్లదండకం అందుకోవడం అతడి నైజం. సూర్యాపేట పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో నివాసముంటున్న వల్దాసు నర్సయ్య గత ఏడాది క్రితం మృతి చెందగా అతని భార్య వీరమ్మ అతడిపేరున ఉన్న వ్యవసాయ భూమిని తన పేరున బదిలీ చేయించుకునేందుకు సదరు అధికారిని సంప్రదించగా నెలల తరబడి అతని చుట్టూ తిప్పుకోని చివరకు రూ. 3వేలు ముట్టచెప్పిన తరువాత 30రోజులకు ఇవ్వాల్సిన ధృవీకరణపత్రం ఎనిమిది నెలల తరువాత ఇచ్చాడని బాధితురాలు మీడియా ముందు వాపోయింది. ధృవీకరణ పత్రం వచ్చిన తరువాత తన భర్త పేరున ఉన్న వ్యవసాయ భూమి 0.20 ఎకరాలు తన పేరున మార్చాలని మార్చి నెలలో ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోని అతడిని సంప్రదించగా మొదటగా రూ. 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు చెప్పడం జరిగింది. అంత ఇచ్చుకోలేనని కాళ్ళ, వేళ్ళ పడ్డిన ఆమె తన వద్ద డబ్బులు లేకున్నా మరి అప్పు చేసి మొదట రూ. 5వేలు తనకు తెలిసిన వారి నుండి నేరుగా అతడి ఫోన్ పే నెంబర్‌కు పంపించినట్లు తెలిపింది. పని పూర్తి అయిన తరువాత మిగతా డబ్బులు ముట్టచెప్పుతామని చెప్పిన ఎనిమిది నెలలు అవుతున్నా పట్టా మార్పిడి కానీ పరిస్థితి.

ఇతగాడి అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులకు ఎంత మంది ఫిర్యాదు చేసిన చెత్తబుట్టలోకే చేరుతున్నాయని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. అతడి అవినీతి అక్రమాలను ఆధారలతో సహా అందించిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు నెలల క్రితం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఇంత వరకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై సదరు అధికారిని వివరణ కోరగా భూ బదలాయింపులో కొన్ని లీగల్ సమస్యలు ఉండడంతోనే ఆగిపోయిందని చెప్పాడు. పని చేసేందుకు వారి నుండి డబ్బులు ఫోన్ పే ద్వారా తీసుకున్నావు కదా అని ప్రశ్నించగా నేను వారిని డబ్బులు అడగలేదు. నా ఫోన్ నెంబర్ అనేక మందికి తెలుసు నాకు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపితే నేను అడిగి డబ్బులు తీసుకున్నట్లా అని ఎదురు ప్రశ్న వేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇతగాడి అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు ఇప్పటికైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు మండలంలో ఎంఎల్‌ఏ పర్యటన



**ప్రజాపక్షం/డిండి:** నేడు డిండి మండలంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పర్యటించనున్నట్లు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్‌రెడ్డిలు ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు డిండి మార్కెట్ యార్డులో ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం కళ్యాణ లక్ష్మీ లబ్దిదారులకు చెక్కుల పంపిణి, 11 గంటలకు నూతనంగా నిర్మించిన గోదాంను డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తారు. 11.45గంటలకు మండలంలోని చెరుకుపల్లి వద్ద ఏర్పాటు చేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

## రైతు భరోసా జమ చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో రైతు భరోసాను వెంటనే జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని వికాస్ బి ఫార్మసి కళాశాలలో సిపిఎం పార్టీ 3వ టౌన్, రూరల్ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ పేదలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో మతోన్మాద శక్తుల బిజెపి, అనుబంధ సంఘాలు అధికారంలో ఉండడంతో మైనార్టీ మతాలపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని చెప్పారు. నిరుపేద వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి ఇస్తామన్న రూ. 12వేలు, అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీని ఏలాంటి శరతులు లేకుండా రైతులందరికి అమలు చేయాలన్నారు. అంతకు ముందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మల్లు స్వరాజ్యం, బుద్ధదేవ్ భట్టాచార్య, పెన్నా అనంతరామ శర్మ, మామిడి మరియమ్మ, చింత మంగయ్య, భిక్షంల మహాసభలో తీర్మానం పెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, దండ వెంకట్ రెడ్డి, కొప్పుల రజిత, సైదమ్మ, శేఖర్, చంద్రారెడ్డి, సత్యం, రాంరెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ఆదుకోవాలి : శ్రీనివాస్



**ప్రజాపక్షం/నందికొండ :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆదివారం నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల నాయకులు కౌన్సిలర్ హీరే కార్ రమేష్ జి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మానిఫెస్టోకు సంబంధించి ఇచ్చిన హామీలో భాగంగా ఉద్యమకారులకు ము ఖ్యంగా 151 బైండోవర్ కేసులో ఉన్న వారికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వటం జరుగుతుందని మాటిచ్చారని, అందుకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టు బడాలని వారన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధ న సమయంలో కేసుల పాలైన ఉద్యమకారులను గుర్తించటానికి 10 వేల కోట్ల రూపాయలతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని,అదే విధంగా 25 వేల రూపాయల పెన్షన్ తో పాటు బస్ పాస్ సౌకర్యం, హెల్త్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లలో పది శా తం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారులు సిరికొండ మధు, పందిర్ల ఉక్కు,బోడ విజయ,వీరయ్య, పిట్ట సైదులు పాల్గొన్నారు.

## ఎంపికి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటి సభ్యులుగా నల్గొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి నియమించబడడం పట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో రఘువీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేమన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కమిటి ద్వారా రఘువీర్‌రెడ్డి రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి వారి సంక్షేమానికి తొడ్పడతాడని అన్నారు.

## 'బిసిగర్జన' సభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/వేములపల్లి :** వచ్చేనెల మూడవ తారీఖు జరగనున్న బిసి గర్జన సభకు బిసిలందరూ ఐక్యత రాగంతో తరలిరావాలని వేములపల్లి మాజీ సర్పంచ్ నాగవల్లి మధు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి హక్కుల సాధన కోసం పోరాడడం తప్పేమి కాదని హక్కులు సాధించేంతవరకు బిసిలు అంతా ఐక్యతతో ఉండాలని జరిగే బిసి గర్జనకు మండలంలోని నాయకులంతా రాజకీయాలకతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

## వాతావరణ పరిరక్షణకే ఎలక్ట్రానిక్ వాహనాలు



**ప్రజాపక్షం/మోటకొండూర్/యాదాద్రి:** వాతావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రానిక్ వాహనాలు తయారు జరుగుతున్నదని, నిరుద్యోగం నిర్మూలనకు ఏడిఎంఎస్ పూర్తిగా సహకరిస్తుందని ఏడిఎంఎస్ లైన్ ఆఫ్ లైనర్ నారాయణ తెలిపారు. ఆయన ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సంకల్ప్ హోటల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే 10 సంవత్సరాలలో ప్రతి ఇంట్లో ఎలక్ట్రానిక్ వాహనాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విన్నర్స్‌కు మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, శంకర్ రెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, రఘునాధరాజు, రాము, బుగ్గ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## నరేష్ కుమార్‌కి డాక్టరేట్

**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణలోని ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్శిటీలో స్టాటిస్టిక్స్ విభాగంలో చేసిన పరిశోధనకిగాను భువనగిరికి చెందిన పాదరాజు నరేష్ కుమార్ డాక్టరేట్ పట్టాను పొందాడు. అనాలసిస్ ఆన్ మోడలింగ్ అండ్ ప్రిడిక్షన్ అక్యురసి ఆఫ్ టొబాకో ప్రైసెస్ ఇన్ ఇండియా అనే అంశంపై డాక్టర్ ఎం.రాఘవేందర్ శర్మ పర్యవేక్షణలో పిహెచ్డీ పూర్తి చేశారు. నరేష్ కుమార్ రీసెర్చ్ పేపర్లు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. నరేష్ కుమార్ ప్ర స్తుతం విబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాద్యతలను నిర్వర్తిస్తున్నారు. నరేష్ కు మార్‌కి కుటుంబ సబ్యులు, బందు మిత్రులు, విద్యావేత్తలు, రాజకీయ నాయకులు అభినందనలు తెలియచేశారు.



## కొమురమ్మ కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన మేకల కొమురమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందింది. మల్కాపురం గ్రామానికి చెందిన కొడారి లత మల్లేష్ యాదవ్‌లు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కొమురమ్మ మృతికి తమ సానుభూతి తెలియజేస్తూ, అంత క్రియల అవసరార్థం వారి కుటుంభ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించేశారు. ఈ కార్యక్రమంలో తోడేటి వెంకటేష్, సోన్నాయిల శంకరయ్య, రఘు, గుంటి మల్లయ్య, చంద్రకాంత్ రావు, గుంటి మహేష్, పిడిగు జంగయ్య, ఆనంద్ చారి,పిడిగు భాను, శ్రీను, బండారి మహేష్, పోషమ్మ,భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమైన కోరికలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పోలీస్ కుటుంబాల న్యాయమైన కోరికలను పోలీస్ ఉన్నతాధికారులు ప్రభుత్వంతో చర్చించాలని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. ఆందోళన చేస్తున్న పోలీస్ కుటుంబాలను వేధించవదని, ఆ పోలీస్‌లను ఉద్యోగాల నుంచి తొలగించవద్దని, తెలంగాణ ప్రత్యేక పోలీస్ బలగాల కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళన న్యాయమైందన్నారు. పోలీసులు రాజకీయ నాయకుల మాటలు విని ఎక్కువ సందర్భాల్లో ప్రజా కంటకులుగా మారుతున్నారు. లాకప్ డెత్ లు, తప్పుడు కేసులు,నిర్లక్ష్యం,ఆక్రమణ దారులుకు, దూర్మార్గులకు రక్షణ కల్పించకుండా విచారణ పేరుతో హింసించడం, ఉద్యమాలను ప్రజాపోరాటాలను అణిచివేయడానికి లాఠీ ఛార్జీ నుంచి అనేక అప్రజాస్వామిక విధానాలు బూటకపు ఎదురుకాల్పుల వరకు అనేక చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టి అధికార పక్షానికి వత్తాసు పలకడం వరకు అనేక చెడ్డ పనులు చేస్తూ ప్రజలకు దూరం అయ్యారు. ప్రత్యేక పోలీస్ విభాగల పోలీస్ కుటుంబాలు చేస్తున్న పోరాటాలను అర్థం చేసుకుని పోలీస్ ఉన్నతాధికారులు ప్రభుత్వంతో మాట్లాడి వాళ్ల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరారు.

## ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన తొలి, మలిదశ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోక్ అంజయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం వలిగొండ మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి రూ.25 వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలంతో పాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఉద్యమకారులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు ఆదివారం జిల్లా, డివిజన్, మండల, స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు మల్లమ్మ, జిల్లా సంస్కృతిక కార్యదర్శి వెంకటేశం గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

## హామీలను పక్కదోవ పట్టించేందుకే కాంగ్రెస్ విష ప్రచారం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** అధికార పార్టీ ఆరు గ్యారంటీల అమలును పక్కదోవ పట్టించేందుకు ప్రజల దృష్టి మరలించేందుకు కాంగ్రెస్ పార్టీ మూసీ ప్రక్షాళనకు బిఆర్ఎస్ పార్టీ వ్యతిరేకమని విషప్రచారంతో బురదజల్లే ప్రయత్నం చేస్తుందని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ నది ప్రక్షాళనకు బిఆర్ఎస్ పార్టీ వ్యతిరేకం అనే కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శల విష ప్రచారం నేపథ్యంలో ప్రజలకు మరింత స్పష్టత నిచ్చేందుకు పట్టణ కేంద్రంలో ఆదివారం ఆయన ఆపార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్ ఇతర ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశం కౌన్సిలర్స్ సామ మల్లారెడ్డి కుడికాల అఖిల బలరాం దేవరాయ కుమార్ మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సామ రవీందర్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యాల మహిపాల్ రెడ్డి,రామిరెడ్డి పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/మోటకొండూరు:** మండలంలోని వర్టూర్‌లో గువ్వ రవి ముదిరాజ్ భార్య గువ్వ పద్మ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకోని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సూదగాని పౌండేషన్ చైర్మెన్ సూదగాని హరిశంకర్ గౌడ్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాలర్పించి, ఆమె మృతిపట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదగాని రాందాసు, కాదూరి శ్రీనివాస్, కొల్తూరి అశోక్, గువ్వ ఎల్లయ్య, పల్లె వెంకన్న, గువ్వ మల్లయ్య, పల్లె మధు, గిరిబోయన మచ్చయ్య, గువ్వ వెంకన్న, పల్లె చిన్న మైసయ్య, గువ్వ పరుషరాములు, గువ్వ కిష్టయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహాంగీర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆదివారం మండల ఆరవ మహాసభలో ముఖ్య అతిధిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ మాట్లాడుతూ గుండాల మండలం అన్ని రంగాల్లో వెనుకబడడానికి ఈ ప్రాంతం నుండి చట్టసభలకు ఎంపికైన ప్రజా ప్రతినిధులే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటి సభ్యులు బొల్లు యాదగిరి, రైతు సంఘం జిల్లా సినియర్ నాయకులు యాదిరెడ్డి పాల్గొన్నారు.

## బిజెపి జెండా ఎగుర వేయాలి



**ప్రజాపక్షం/చండూరు:** రానున్న మున్సిపల్ ఎలక్షన్‌లో చండూరు మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ జెండాను ఎగురవేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చండూరు మున్సిపాలిటీలో బిజెపి మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ ఆద్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో పార్టీ ఇచ్చన పిలుపు మేరకు వంద శాతం సభ్యత్వం నమోదు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం , చండూరు మండల పార్టీ అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులు , పార్టీ నాయకులు భూతరాజు శ్రీహరి, తడకమళ్ళ శ్రీధర్ , మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

## సాగునీరందించిన ఘనత కాంగ్రెస్‌దే

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి సాగు నీరు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు గద్వాల్ ఉపేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు కొరల్లో చిక్కుకున్న గుండాల మండలానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎటువంటి ఆధారం లేకుండా పోయి కరువు పెరిగి రైతన్న అల్లాడిన పరిస్థితి నెలకొంది. మండలానికి నీరందించే సదుపాయం ఉన్న గత పాలకుల నిర్లక్ష్యంతో చుక్క నీరు కూడా అందకపోవడంతో రైతన్నకు తీరని నష్టం వాటిల్లింది.

## పుస్తకం.. అక్షర ముత్యాల మాల



**ప్రజాపక్షం/భువనగిరి:** పుస్తకం పుటలు ఆల్చిప్పల నడుమన పొదిగిన అక్షరముత్యాల మాల అని రిటైర్డ్ తహసీల్దార్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, ప్రముఖ రచయిత జన్వాడ రామస్వామిలు పేర్కొన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బాగాయత్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత లెక్కల మల్లారెడ్డి రచించిన జీవన గమనాలు, జీవన చిత్రాలు, అనే పుస్తకాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత లెక్కల మల్లారెడ్డి, పూర్వ విద్యార్థులు మాయ దశరథ, పూస శ్రీనివాస్, బుర్ర రాజు అనంత చందర్, మాటూరు శ్రీలత, మదాసు ప్రశాంతి పాల్గొన్నారు.

## 'నానీ కిరణాలు' ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** నానీ కిరణాలు కవితా సంపుటిలో ఎంతో వస్తు వైవిధ్యం ఉందని, సమకాలీన విషయాలతో పాటుగా వ్యంగ్య ప్రధానంగా కవి చురకలు వేశాడు. వర్తమాన కవులు నానీల రచనల ద్వారా వచన కవితా రంగంలోకి అడుగుపెట్టడం ఆనందాన్ని కలిగిస్తున్నదని డా.ఎన్. గోపి అన్నా రు. ఎంపీపీఎస్ మహమ్మదాబాద్, నారాయణపురంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కంచనపల్లి రవికాంత్ రచించిన నానీ కిరణాలు గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ ఆయన ప్రసంగించారు. డా.ఎస్.రఘు అధ్యక్షతన జరిగిన ఈ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ జి.శ్యాం ప్రసాద్ లాల్, తండ హరీష్ గౌడ్, తగుళ్ల గోపాల్, పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ శాలిగౌరారం:** శాలిగౌరారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 2001 బ్యాచ్‌కు చెందిన చిర్రబోయిన మల్లయ్య , మొలుగూరి యల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఆ విషయం తెలుసుకున్న పదవ తరగతి విద్యార్థులు ఆ కుటుంబాలకు చేరో 30 వేల రూపాయల ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌర వీరయ్య , పంతంగి నగేష్ , తోట వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడిని ఆదుకోవాలి



**ప్రజాపక్షం/ రామన్నపేట:** తాటి చెట్టుపై నుంచి పడి గాయాలపాలైన గీత కార్మికుడు కల్లెపు మహేష్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గాజుల ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజులు డిమాండ్ చేశారు. పైల్వాన్‌పురం గ్రామానికి చెందిన కల్లెపు మహేష్ ఆదివారం కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కి మోకుజారి కిందపడి తీవ్ర గాయాలపాలు కాగా స్థానికులు చూసి రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. గీత వృత్తిపైనే ఆధారపడి జీవించే మహేష్ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎర్ర రవీందర్, పులి భిక్షం, పబ్బతి ఆంజనేయులు, బాల కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన నిరుపేద రచ్చ శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మునిపంపుల గ్రామానికి చెందిన న్యాయవాదులు మృతుని కుటుంబానికి రూ.21వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఆర్థిక సహాయం అందించిన న్యాయవాదులు మేకల దుర్గయ్య, యాదాసు యాదయ్య, ఈపూరి విశ్వప్రసాద్, మిర్యాల రవీందర్, ఈపూరి లక్ష్మీ నరసింహాస్వామి, పెద్దోట శ్రీనివాస్, పెద్ది కవిత, మాధవి, దామెర నాగేశ్వర్‌రావు తదితరులు ఆర్థిక సహాయం అందచేశారు.

## పత్తిని కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/చండూరు :** నల్లగొండ జిల్లాలో సిసిఐ కొనుగోలు కేంద్రాలు ప్రాంరంభించిన్పటికి రైతల నుండి ఒక్క క్వింటా పత్తిని కూడ కొనుగోలు చేయలేదని వెంటనే రైతల నుండి పత్తి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బిజెపి నల్లగొండ జిల్లా అధికార ప్రతినిధి నకిరెకంటి లింగస్వామిగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 22 సిసిఐ కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పుకోవడమే తప్ప రైతుల నుండి పత్తిని మాత్రం కొనుగోలు చేయడం లేదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సిసిఐ కొనుగోలు కేంద్రాలలో పత్తిని వెంటనే కొనుగోలు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పాఠశాలల్లోనే గురు శిష్యుల బంధానికి బలం



**ప్రజాపక్షం/మోటకొండూరు:** గురు శిష్యుల బందం పాఠశాల స్థాయిలోనే బలంగా ఉంటుందని అనడానికి నిదర్శనం ఈ ఆత్మీయ సమ్మేళనం అని జి.గోపాల్ రెడ్డి పారిశ్రామికవేత్త, ఆర్.శ్రీనివాస్, డియస్‌పిలు అన్నారు. వారు ఆదివారం మోటకొండూరు మండలంలోని చాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993/94 సంవత్సరంలో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించిన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో వివేర హోటల్‌లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం సంతోషకరమని, ఆత్మీయ సమ్మేళనం ద్వారా అందరిని కలుకునే అదృష్టం కలిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులు చాడ భగవాన్ రెడ్డి, రాములు, ఆచార్య, అమరేందర్ రెడ్డిలను ఘనంగా శాలువాలతో సన్మానించారు. చాడ పాఠశాలలో 1993/94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన ప్రతి ఒక్కరికి మెమోంటో శాలువా క్యారీ బాగులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోప్పుల వెంకట్ రెడ్డి, మహేందర్, తిర్మల్ రెడ్డి, మహామూద్, దశరథ, వెంకన్న, శ్యామల, మంగమ్మ, రషీదా పాల్గొన్నారు.

## కనీస వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/మోటకొండూరు:** మోటకొండూరు మండల కేంద్రంలో నిర్మించినటువంటి డబుల్ బెడ్ రూమ్‌లకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోలగాని జయ రాములు, మండల పార్టీ కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద కాలనీవాసుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఏర్పాటు చేసింది కానీ వారికి కనీసం రోడ్డులేని పరిస్థితి ఇండ్ల చుట్టూ గడ్డి పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు తేళ్లు వస్తున్నాయని కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వడ్డేబోయిన మహేందర్, ఆరెగూడెం గ్రామ శాఖ కార్యదర్శి కొల్లూరు రమేష్, చెరుకు అనిల్, కొల్లూరు నగేష్, కొల్లూరు నాగరాజు పాల్గొన్నారు.





## మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావుకు సన్మానం

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** కాంగ్రెస్ డిసిసి జనరల్ సెక్రెటరీ నుచ్చు నాగయ్య ఆధ్వర్యంలో నూతన భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావుకి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కూనూరు మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎండి కాజా, ఉపాధ్యక్షులు జహంగీర్, ఎస్సి సెల్ మండల కార్యదర్శి పాశం ఎల్లయ్య, బుగ్గ కుమార్ పాల్గొన్నారు.

## మండల స్వామి మరణం సాహిత్యానికి తీరని లోటు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కవి రచయిత ఉపాధ్యాయుడు డాక్టర్ మండల స్వామి ఆకస్మిక మరణం తెలుగు సాహిత్యానికి తీరనిలోటని ఉపాధ్యాయ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు.స్వామి పై రాసిన స్మృతి కవిత్వం, వ్యాసాలతో వెలువరించిన స్నేహపరిమళం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో నల్లగొండలో జరిగిన మండల స్వామి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ మండల స్వామి రచనలు ప్రజా చైతన్యానికి దోహదం చేశాయని కొనియాడారు. ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మండల స్వామి సాహిత్యం ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య , డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, మునాస్ వెంకట్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, గడ్డం శ్రీను, కాసుల ఆంజనేయులు, నకిరేకంటి శ్రీనయ్య, శ్రీకళ రామమూర్తి పెరుమాళ్ళ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకొచ్చి జీవో నెం.317 వల్ల నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇప్పటికీ వారి జిల్లాలకు పంపలేదని అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని తీసుకొస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రభుత్వ హామి నేటికి అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2022 జూలై నుంచి ఇవ్వాల్సిన డీఏల విషయంలోనూ దాటవేసే ధోరణి సరైందికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జామ్లు, శ్రీను,రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## బిసి కమిషన్‌కు విజ్ఞప్తి చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నేటి నుంచి నవంబర్ 13 వరకు 17రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కులగణన సర్వేలో భాగంగా పర్యటన చేస్తున్న బీసీ కమీషన్‌కు ఆయా జిల్లాల నాయకులు బీసీలకు కావాల్సిన వివిధ అంశాలపై విజ్ఞప్తు లు సమర్పించాలని బీసీ సంక్షేమ సం ఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.





## సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఈ నెల 30న ఎన్‌జి కళాశాల మైదానంలో జరిగే యాదవుల సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మద్ది శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా యాదవ సంఘ భవనంలో జరిగిన సమావేశంలో సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మద్ది శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ప్రతి సంవత్సరం యాదవులు సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారని, పాడిపంటలు చక్కగా ఉండాలని గోవులను పూజించి, దున్నపోతులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి విన్యాసాలు నిర్వహిస్తామని, పోతురాజుల విన్యాసాలు కూడా ఆకర్షణీయంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు పిల్లి రామరాజు యాదవ్, ఎల్‌వి యాదవ్, అల్లి సుభాష్ యాదవ్, తరాల పరమేశ్ యాదవ్, గుండెబోయిన జానయ్య యాదవ్, గంగుల చందువంశీ యాదవ్, బెల్లి నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

## మూలుగుతున్న ప్రీ స్కూల్ మెటీరియల్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అంగన్‌వాడి కేంద్రాలకు సరఫరా అయిన ప్రీ స్కూల్ మెటీరియల్ ఇంకా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లోనే, అంగన్‌వాడి కేంద్రాల్లోనే మూలుగుతున్నాయి. అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యనభ్యసించే కార్యక్రమంలో బాగంగా ప్రీ స్కూల్ మెటీరియల్ పంపిణి, మిర్యాలగూడ, దామరచర్ల ప్రాజెక్టు పరిధిలో ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడి పిల్లల కోసం రీడింగ్ మాట్, రౌండ్ టేండ్, బుక్స్ స్టాండ్, యూనిఫాం దుస్తులు దామరచర్లలోని 180, మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలో 70 అంగన్‌వాడి కేంద్రాలకు అందించడం లో భాగంగా మెటీరియల్ వచ్చింది. ఉపయోగంలోకి రాలేదు. వృధాగా ఉన్న మెటీరియల్‌ను ఎప్పుడు పంపిణి చేస్తారు ఉపయోగంలోకి తీసుకొస్తారు అని ఆయా ప్రాజెక్టు ఆఫీసర్లు ఆర్.మమత, ఎన్.చంద్రకళను ప్రశ్నించగా రాష్ట్ర స్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు త్వరలో పంపిణి చేస్తారని తెలిపారు.

## దరఖాస్తులు అందజేత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆన్‌లైన్ దరఖాస్తులను బంజార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కల్పనకు ఆదివారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాశాలల, జూనియర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ యూనివర్సీటల్లో పనిచేస్తున్న అధ్యాపకులు టీచర్ ఎమ్మెల్సీ ఓటు కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంకా పది రోజులు మాత్రమే గడువు ఉన్నందున ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

## శతమన్యుకు బంగారు పతకం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** హైద్రాబాద్‌లోని జీఆర్ఎస్ అకాడమి వారు ఆదివారం నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన బట్టు శతమన్యు బంగారు పతకం సాధించాడు. హైద్రాబాద్ కూకట్‌పల్లిలో నిర్వహించిన అంతర్ పాఠశాలల పోటీల్లో 9 ఏండ్ల వయస్సులోపు విభాగంలో మొదటిస్థానం సాధించాడు. పట్టణానికి చెందిన స్త్రీల వైద్యురాలు డాక్టర్ రమాదేవి, న్యాయవాది బట్టు వెంకటేశ్వర్లు కుమారుడైన శతమన్యు గతంలో జిల్లా,రాష్ట్ర స్థాయిలో పలు బహుమతులు సాధించాడు. శతమన్యు ప్రస్తుతం పట్టణంలోని విశ్వభారతి హైస్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. బంగారు పతకం సాధించిన శతమన్యును పలువురు అభినందించారు.